క్లుప్తంగా

కర్జిలో పోలీసుల కార్డన్ సెర్చ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై

దహెగాం: మండలంలోని కర్జిలో మంగళవారం పోలీసుల ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్సై సనత్‌కుమార్ ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామాల్లో ఎవరైనా అపరిచిత వ్యక్తులు సంచరిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత చెడు వ్యసనాలు వీడి గ్రామాభివృద్ధికి పాడుపడాలని సూచించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్ రాజశేఖర్

రెబ్బెన: మండలంలోని కిష్టాపూర్‌లో ఉపాధిహామీ కూలీలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. మంగళవారం కూలీలు పని చేస్తున్న ప్రదేశానికి వెళ్లి ఆర్థిక అక్షరాస్యత కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ రాజశేఖర్ జన్‌ధన్ ఖాతా, పొదుపు ఖాతాలు, సామాజిక రక్షణ పథకాల వల్ల ప్రయోజనాలను కూలీలకు వివరించారు. సైబర్ నేరాలకు గురైతే సైబర్‌క్రైం హెల్ప్‌లైన్ నంబర్ 1930ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వనజారాణి పాల్గొన్నారు.

ఆటపాటలతో బోధన చేయాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: ఆటపాటలతో విద్యాబోధన చేయాలని ఎంపీడీవో సత్యనారాయణ గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని కరంజివాడ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రీస్కూల్ పిల్లలకు అందిస్తున్న సేవలపై అంగన్‌వాడీని అడిగి తెలుసుకున్నారు. అనంతరం భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఈజీఎస్ ఏపీవో మలయ్య, పంచాయతీ కార్యదర్శి వేణు, సర్పంచ్ తదితరులు ఉన్నారు.

అలరించిన వార్షికోత్సవం

కౌటాల: మండల కేంద్రంలోని కోయగూడ కాలనీ సమీపంలో గల నజరేత్ మిషన్ ప్రైవేట్ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన వార్షికోత్సవం వేడుకలు అలరించాయి. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు అందర్ని ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం స్టీవెన్, ఉపాధ్యాయులు ప్రశాంతి, పార్వతి, మేరీ, కవిత, హెప్సిబా, మమత, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్
కుమురంభీం : దసరా
కాగజ్‌నగర్
వెంకటరమణ : బలగం
- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	60
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	60
సోరకాయ	60
చిక్కుడు కాయ	30
గోబి(పూల్)	40
క్యాబేజ	40

-ఆసిఫాబాద్‌అర్బన్

'రేషన్' పెంచేదెప్పుడు..?

- బియ్యం పంపిణీపై లబ్ధిదారుల అసంతృప్తి
- మూడు నెలలుగా 5కిలోలే పంపిణీ
- ఇతర సరుకులు సైతం అందించాలని డిమాండ్



బియ్యం కోసం వేలిముద్ర వేస్తున్న లబ్ధిదారుడు



బియ్యం అందిస్తున్న రేషన్‌షాపు సిబ్బంది

కెరమెరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యంపై లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కరోనా కాలం నుంచి ప్రతీ నెల ఒక్కో లబ్ధిదారుడికి 10 కిలోల బియ్యం అందిస్తూ వచ్చిన ప్రభుత్వం గడిచిన మూడు నెలలుగా ఒక్కొక్కరికి కేవలం 5 కిలోలే అందిస్తుంది. ప్రస్తుతం ఇచ్చే బియ్యం కూడా కేంద్ర ప్రభుత్వం అందిస్తుండడంతో, రాష్ట్ర ప్రభుత్వం కోటా ఏమైందని లబ్దిదారులు ప్రశ్నిస్తున్నారు.

కేవలం బియ్యంతోనే సరి

గతంలో 9 రకాల వస్తువులను అందించిన రేషన్ షాపులు క్రమంగా సరుకులను తగ్గిస్తూ వచ్చి ప్రస్తుతం బియ్యానికే పరిమితమయ్యాయి. గతంలో రేషన్‌కార్డుకు లీటరు చొప్పున కిరోసిన్ అందించేవారు. కాని నాలుగేళ్ల నుంచి కిరోసిన్ సరఫరా నిలిపివేశారు. అంత్యోదయ కార్డు కలిగిన లబ్ధిదారులకు ఒక్కో కార్డుకు కిలోచొప్పున పంచదార అందించేవారు. కాని రెండేళ్ల క్రితం వాటిని నిలిపివేశారు.

27060 మంది లబ్ధిదారులు

మండలంలో మొత్తం 18 రేషన్‌దుకాణాలు, 8768 రేషన్ కార్డులు, 27,060 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి 1,68,095 కిలోల బియ్యం సరఫరా పంపిణీ చేస్తున్నారు. కాగా పదేళ్ల క్రితం మంజూరైన కార్డులతోనే బియ్యం అందిస్తున్నారు. పదేళ్లలో మండలంలో సుమారు 5వేల కుటుంబాలు పెరిగాయి. ప్రభుత్వం అందిస్తున్న బియ్యం ఎటూ సరిపోక లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని ఒక్కొక్కరికి కనీసం 10 కేజీలు బియ్యం అందించాలని, నూతన రేషన్ కార్డులు మంజూరు చేయాలని మండలవాసులు కోరుతున్నారు.

10 కిలోలు బియ్యం ఇవ్వాలి



ప్రతీ లబ్ధిదారుడికి 10 కిలోల చొప్పున రేషన్ బియ్యం అందించాలి. కరోనా మహమ్మారి తర్వాత ఒక్కొక్కరికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం కలిసి 10 కేజీలు ఇచ్చినప్పటికీ జనవరి నుంచి 5 కిలోల బియ్యానికే పరిమితం చేయడం సరైంది కాదు. ప్రభుత్వం స్పందించాలి.

- కోవ ఇందిరా, మోడి గ్రామం

నివేదిక అందిస్తాం



గత నెల వరకు ఒక్కో లబ్ధిదారుడికి 5కిలోలే బియ్యం అందించగా, ఈనెల నుంచి 6 కిలోలు అందించే అవకాశం ఉంది. నూతన రేషన్ కార్డుల విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తాం. నూతన కార్డుల కోసం చాలా మంది వస్తున్నారు.

- ఎండీ జమీర్, తహసీల్దార్, కెరమెరి

ఆధ్యాత్మికం వైపు అడుగులు

- గ్రామాల్లో జోరుగా మాలధారణలు
- 6న హనుమాన్ జయంతి



గుడ్లబోరి హనుమాన్ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కౌటాల: మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో పెద్దలతో పాటు యువకులు ఆధ్యాత్మిక మార్గం వైపు అడుగులు వేస్తున్నారు. హనుమాన్ జయంతి పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో భక్తులు పెద్ద ఎత్తున హనుమాన్ దీక్షలు చేపడుతున్నారు. ప్రతీ ఏటా వీరి సంఖ్య పెరగడం గమనార్హం.

కిటకిటలాడుతున్న ఆలయాలు

మండలంలో హనుమాన్ మాలధారణ భక్తులు పెరుగుతున్నారు. ఆయా గ్రామాల్లో గల హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయడంతో పాటు భజన కార్యక్రమాలు, పాటలు పాడుతున్నారు. దీంతో ఆలయాలు దీక్ష స్వాములతో కిటకిటలాడుతున్నాయి. మాలధారణ భక్తులు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణ అలవర్చుకుంటారు. ఆధ్యాత్మికంలో ఆరోగ్య సూత్రాలు దాగి ఉన్నాయని మాలధారణ చేసుకున్న భక్తులు పేర్కొంటున్నారు.

పెరుగుతున్న భక్తులు

ప్రతీ ఏటా మండలంలో హనుమాన్ మాలధారణ భక్తులు పెరుగుతున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు వందల సంఖ్యలో స్వామి దీక్షలో ఉన్నారు. మారుమూల గ్రామాల్లోని యువకులు దీక్ష నియమాలు పాటిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. దీక్ష తీసుకునే స్వాములు కఠోర ఉపవాసం చేస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక భజనలు చేస్తూ దీక్ష తీసుకున్నంత కాలం ఇళ్లకు రాకుండా ఆలయాల్లోనే కఠిన నియమాలతో గడుపుతున్నారు.

రేపు హనుమాన్ శోభాయాత్ర

కౌటాల: హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో కౌటాలలో గురువారం హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తలోడి పవనసుత యూత్ సభ్యులు మంగళవారం తెలిపారు. రేపు సాయంత్రం 4 గంటలకు మండలంలోని తలోడి గ్రామంలోని హనుమాన్ మందిర్ నుంచి కౌటాల సాయిబాబా మందిర్ వరకు యాత్ర కొనసాగుతుందన్నారు. మండలంలోని యువత, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

ఏటా దీక్ష తీసుకుంటా



నేను కొన్నేళ్లుగా హనుమాన్ దీక్ష తీసుకుంటున్నాను. ప్రతీరోజు వేకువజామున నిద్ర లేచి ఉదయాన్నే స్నానం చేసి పూజ చేస్తాను. స్వాములందరిలో కలిసి ఉండటం ఎంతో సంతోషంగా ఉంటుంది. దైవ దర్శనంతో మంచి అలవాట్లు అలవడుతాయి.

- వాయుకుమార్, గుడ్లబోరి

చెడు వ్యసనాలకు దూరం



హనుమాన్ దీక్షలు స్వీకరించడంతో నియమనిష్ఠలతో ఉంటాం. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటాం. ప్రతీరోజు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేస్తున్నాం. నేను రెండోసారి హనుమాన్ దీక్ష తీసుకున్నాను. దీక్షతో క్రమశిక్షణ అలవడుతోంది.

- ఆదర్శ్, గుడ్లబోరి

పోలీసుల సేవలు అభినందనీయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైస్‌చైర్మన్ కృష్ణారావు

కాగజ్‌నగర్‌రూరల్: పోలీసుల సేవలు అభినందనీయమని జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. మంగళవారం మండలంలోని ఈజ్‌గాం మార్కెట్ ఏరియాలో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజుతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పోలీసుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేయడం హర్షనీయమన్నారు. సేవా కార్యక్రమాల వల్ల ప్రజల మనస్సుల్లో పోలీసులు నిలిచిపోతారన్నారు. అనంతరం ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈజ్‌గాం ఎస్సై జగదీశ్, ఎంపీటీసీ అమిత్ దాస్, తదితరులు పాల్గొన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: మండల కేంద్రంలో మంగళవారం పోలీసుల ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఎస్సై నల్లా వెంకటేశ్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పోలీసులు మీ కోసంలో భాగంగా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. నాయకులు ఉత్తం నాయక్, నిసార్, రిజ్వాన్, శ్రీనివాస్, సజ్జు, నర్సయ్య, రాజయ్య తదితరులు ఉన్నారు.

తిర్యాణిలో..

తిర్యాణి: పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని కుమురం భీం చౌక్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ అల్లం నరేందర్, ఎస్సై రమేశ్‌లు మంగళవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు సేవా ధృక్పథం కలిగి ఉండాలని సూచించారు.

మహిళా సాధికారత కోసమే వడ్డీ లేని రుణాలు



మాట్లాడుతున్న ఎంపీపీ జుమ్మిడి సౌందర్య

రెబ్బెన: స్వయం సహాయక సంఘాల మహిళల సాధికారత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందజేస్తుందని ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్‌లు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండలంలోని స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం విడుదల చేసిన వడ్డీ రాయితీని పంపిణీ చేశారు. మండలంలో 624 సంఘాలకు రూ. 71.71లక్షల రాయితీని అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ఏపీఎం రాజ్‌కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు, వీవో సంఘాల అధ్యక్షులు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివాజీపై దాడి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని మంగళవారం ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బోట్టుపల్లి జయరాం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై సంఘం నాయకులు దాడికి పాల్పడిన లింగపల్లి కిషన్‌రావు దిష్టి బొమ్మను దాహనం చేశారు. వీరి నిరసనకు బీజేపీ మద్దతు తెలిపింది. కార్యక్రమంలో ఆరె సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు వాసు పటేల్, జిల్లా ప్రధాన కార్యదర్శి బిక్కాజీ, శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు తిరుపతి, గోపాల్, వినోద్, మండల అధ్యక్షుడు సంతోష్, సత్యనారాయణ, బీజేపీ నాయకులు విశాల్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న సెర్ప్ ఉద్యోగులు

రెబ్బెన: సెర్ప్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ పే స్కేల్ వర్తింపజేయడాన్ని హర్షిస్తూ మంగళవారం మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయం ఎదుట సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు పే స్కేల్ అమలు చేస్తూ జీవో 11ను జారీ చేయటం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సౌందర్య, జెడ్పీటీసీ సంతోష్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, ఏపీఎం రాజ్‌కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు, సెర్ప్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీలకు డిగ్రీ విద్యార్థులు

కాగజ్‌నగర్‌టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో పరిశోధన నైపుణ్యాలను పెంపొందించడానికి నిర్వహిస్తున్న జిజ్ఞాస విద్యార్థి ప్రాజెక్టు పోటీల్లో కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం తెలిపారు. బోటనీ, రసాయన శాస్త్రం, ఇంగ్లిష్ ప్రాజెక్టులు త్వరలో హైదరాబాద్‌లో ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన వారికి రూ.25,000 నగదు అందజేస్తారని వెల్లడించారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు



ఎస్టిమేషన్ వేస్తున్న ఐటీడీఏ జేఈ బద్రోద్దీన్

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని శివపూర్ కాలనీ నుంచి హీరాపూర్ గ్రామం వరకు నూతనంగా బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.కోటి 12లక్షల నిధులు మంజూరైనట్లు ఐటీడీఏ జేఈ బద్రోద్దీన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని హీరాపూర్ రోడ్డును పరిశీలించి ఎస్టిమేషన్ వివరాలు సేకరించారు. ఆయన వెంట సిర్పూర్(టి) ఉపసర్పంచ్ తోట మహేష్ ఉన్నారు.

కాగజ్‌నగర్ తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



సన్మానిస్తున్న మీ సేవ నిర్వాహకులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ తహసీల్దార్‌గా ఎండీ మునవ్వర్ షరీఫ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కౌటాల తహసీల్దార్‌గా ఉన్న షరీఫ్ కాగజ్‌నగర్‌కు బదిలీ కాగా కాగజ్‌నగర్ తహసీల్దార్‌గా పని చేస్తున్న ప్రమోద్ కుమార్‌ను కలెక్టరేట్ కార్యాలయ హెచ్ సెక్షన్ పర్యవేక్షకులుగా బదిలీ అయ్యారు. నూతన తహసీల్దార్ మునవ్వర్ షరీఫ్‌ను డెప్యూటీ తహసీల్దార్ రఘునాథ్ రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎండీ ఖాలిక్, మండల సర్వేయర్ బండి శ్రీనివాస్, ఆర్ఐ 2 ముసావీర్, మీ సేవా కేంద్రాల నిర్వాహకులు సన్మానించారు.

వృత్తి శిక్షణ కేంద్రం ప్రారంభం

తాండూర్: మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లో మంగళవారం బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ శిబిరం ఏర్పాటు చేయగా, సేవా సమితి ఏరియా అధ్యక్షురాలు జి.స్వరూపారాణి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. మహిళలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయండి

నార్నూర్: మండల కేంద్రంలోఈనెల 9న నిర్వహించే బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రైవెట్ జిన్నింగ్‌లో జరిగే ఆత్మీయ సమ్మేళన స్థలాన్ని వారు పరిశీలించారు. 5 వేల మంది కార్యకర్తలు హాజరయ్యేలా స్థలాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి వంద నుంచి 200 మందిని తరలించాలన్నారు. ఎంపీపీ కనక మోతుబాయి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మెస్రం హన్మంతరావు, సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్, ఎంపీటీసీ పరమేశ్వర్, కార్యదర్శి సయ్యద్ ఖాశీం, విద్యార్థి విభాగం అధ్యక్షుడు కొర్రెళ్ల మహేందర్, 23 గ్రామ పంచాయతీల సర్పంచులు పాల్గొన్నారు.

తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



చంద్రశేఖర్

దహెగాం: ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాల్సిందిగా దహెగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సివిక్స్ అధ్యాపకుడు నోముల చంద్రశేఖర్‌కు ఆహ్వానం లభించింది. ఈనెల 9, 10వ తేదీల్లో తిరుపతిలో మహతి ఆడిటోరియంలో కళావేదిక చైర్మన్ డా. కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. కవులు, కళాకారుల ప్రోత్సాహం కోసం ప్రపంచ కవితోత్సవం -సాహితీ సదస్సులు, కళా ప్రదర్శనలు, పుస్తకావిష్కరణలు వంటి సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. చంద్రశేఖర్‌కు ఆహ్వానం అందడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనప్ప

కౌటాల: గ్రామీణ ప్రాంతాలను అన్ని విధాల అభివృద్ధి చేయడమే ధ్యేయమని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మంగళవారం మండలంలోని పార్డీ, వీరవెల్లి, సాండ్‌గాం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల ప్రజలు, పార్టీ కార్యకర్తలతో మాట్లాడారు. గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. పార్డీ గ్రామంలో హనుమాన్, మాతాజీ ఆలయాల నిర్మాణానికి రూ.10లక్షల సాయం తనవంతుగా అందిస్తానని తెలిపారు. ఎంపీపీ విశ్వనాథ్, పార్టీ యూత్ మండల అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, నాయకులు మధుకర్, రమేశ్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి



సిర్పూర్(టి): సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు



కెరమెరి: వినతిపత్రం అందిస్తున్న వీవోఏలు

కెరమెరి: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఐకేపీ వీవోఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కూటికల ఆనంద్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ సీసీలు ధన్‌రాజ్, సత్తయ్యలకు ఈమేరకు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీ సభ్యులకు చేదోడువాదోడుగా ఉంటూ వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఎంతో కృషి చేస్తున్నప్పటికీ ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. సెర్ప్ ఉద్యోగులగా గుర్తించాలని, కనీస వేతనం రూ. 26వేలు పెంచాలని, సాధారణ, ఆరోగ్య బీమా రూ.10 లక్షలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీవోఏలు ఇందిరా, సుజాత, లక్ష్మి, శారద, రమేశ్, ధర్మ్మా, రాజేశ్, యశోద, రఘునాథ్, పార్వతి, భీంరావు తదితరులు ఉన్నారు.

సమ్మె నోటీసు అందజేత

సిర్పూర్(టి): మండలంలో వీవోఏలుగా విధులు నిర్వర్తిస్తున్న వారి సమస్యలను ప్రభుత్వం గుర్తించి పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీవోఏలు చేయనున్న సమ్మెకు సంబంధించిన నోటీసును మంగళవారం ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం దుర్గయ్యకు అందజేశారు. వీవోఏలకు కనీసవేతనం రూ. 26వేలు చెల్లించడంతో పాటు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని లేకుంటే ఈనెల 17 నుంచి నిరవధిక సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. సంఘం నాయకులు జాడె అనిల్, నాగపురె పాండు, అంగాల సతీష్, బోర్కుటి జయంత్, జ్యోతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

కాగజ్‌నగర్‌టౌన్: ఐసీఐసీఐ బ్యాంకుల్లో పని చేయడానికి ఆసక్తి కలిగిన డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థుల కోసం కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దటైమ్స్ ప్రో వారి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు భారీ స్పందన లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి నరసింహం తెలిపారు.